## ఆదివాసీ యువకుడికి ఎంబీబీఎస్ పట్టా



ఎంబీబీఎస్ పట్టా స్వీకరిస్తున్న రొడ్డ దినేశ్

కాసిపేట, ఏప్రిల్ 12 : కాసిపేట మండలం నాయకపుగూడకు చెందిన ఆదివాసీ యువకుడు రొడ్డ దినేష్ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. రొడ్డ కిష్టయ్య-సునీత దంపతుల పెద్ద కొడుకు దినేశ్ హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజ్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ పూర్తి చేసి, ఎంబీబీఎస్ పట్టాపొందాడు. ఈ మేరకు ఉస్మానియా మెడికల్ కళాశాలలలో నిర్వహించిన 174వ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో దినేష్ ఎంబీబీఎస్ డాక్టర్ పట్టా స్వీకరించాడు. దినేశ్ నాయకపుగూడలోని పెద్దగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, ఆ తర్వాత తండ్రి దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడు కావడంతో ఒకటి నుంచి 8వ తరగతి వరకు దేవాపూర్ కార్మెల్ గిరి కాన్వెంట్ హై స్కూల్‌లో చదువుకున్నాడు. అనంతరం కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 10వ తరగతితో పాటు ఇంటర్ పూర్తిచేశాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని బాచుపల్లి శ్రీ చైతన్యలో నీట్ కోచింగ్ తీసుకొని 2019లో 528 మార్కులతో 97.57 శాతంతో ఆల్ ఇండియా 33,949 ర్యాంక్ సాధించాడు. మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో సీట్ వచ్చినా తెలంగాణలోనే చదవాలని కాంక్షతో 2019లో ఉస్మానియా మెడికల్ కాలేజ్ చేరాడు. ఈ మేరకు గ్రామస్తులు, మండల ప్రజలు అభినందించారు.

## నూతన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి రాములు డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్‌లు అమలు చేసేందుకు యత్నిస్తున్నదని మండిపడ్డారు. రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న ఢిల్లీలో సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు వివరించారు. సీఐటీయు నాయకులు ముంజం శ్రీనివాస్, బాలకిషన్, శ్రీకాంత్, త్రివేణి, శంకర్, పద్మా, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## గూడెంలో చైత్ర పౌర్ణమి జాతర


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, ఏప్రిల్ 12 : మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం చైత్రపౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు సమీప గోదావరిలో పుణ్య స్నానాలు చేసి, సత్యదేవుడిని దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి కావడంతో భక్తులు ఉదయం వేళ అధిక సంఖ్యలో తరలివచ్చారు. 185 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలపై సమీక్ష

మందమర్రి, ఏప్రిల్ 12 : సింగరేణి ఆధ్వర్యంలో 14న అధికారికంగా జరిగే అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై శనివారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో ఏరియా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘం సభ్యులతో ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని సింగరేణి గ్రీన్ పార్క్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. అనంతరం సీఈఆర్ క్లబ్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నటుల తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు మైత్రేయబంధు, బాబు, డీవైపీఎం ఎండీ ఆసిఫ్, జీఎం కార్యాలయ సూపరింటెండెంట్ రాయలింగు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుదర్శన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు హరి రామకృష్ణ, కే తిరుపతి, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, తిరుపతి పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. అంబేద్కర్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, సిబ్బంది తూడూరు దత్తాత్రేయ, జనార్దన్ పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్సీ విజయశాంతికి విజ్ఞప్తి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 12 : సింగరేనిలో విరమణ పొందిన కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ శనివారం రిటైర్డ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్సీ విజయశాంతిని కలిసి కోరారు. శాసన మండలిలో సమస్యలపై మాట్లాడి పరిష్కరించాలని పేర్కొన్నారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వేణుమాదవ్ తదితరులున్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా క్రీడా యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి ఉచిత శిక్షణ శిబిరాల్లో శిక్షకుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ అధికారి రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు శిబిరాలు ఉంటాయని, ఆసక్తి గల పీడీ, పీఈటీ, క్రీడాకారుల నుంచి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ అందించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 14 ఏండ్ల బాలబాలికలకు మాత్రమే శిక్షణ ఉంటుందని, శిక్షకులకు క్రీడా ప్రాధికార సంస్థ నుంచి పారితోషికం అందించడం జరుగుతుందని తెలిపారు. 20వ తేదీలోగా జిల్లా కార్యాలయంలో స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## మామిడి మార్కెట్ ఏర్పాటు

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 : పట్టణంలోని కన్నాల ఏరియా వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కార్యదర్శి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వ్యాపారస్తులు తమ వ్యాపారం కోసం లైసెన్స్ పొందాలని సూచించారు. అందుకు సంబంధించిన పత్రాలు కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పాము కాటుతో చిన్నారి మృతి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 12 : మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఉదయశ్రీ (4) పాము కాటుతో మృతి చెందింది. వివరాల ప్రకారం.. తండ్రి సుధాకర్ హోటల్‌లో పని చేస్తుండగా, తల్లి వందన కూలీ పనులు చేస్తుంటుంది. వీరికి ముగ్గురు బిడ్డలు. చిన్న కూతురు ఉదయశ్రీ శనివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా కాలుపై పాము కాటు వేసింది. చిన్నారి గమనించలేదు. రక్తం రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

# కాసిపేటకు ఆర్టీసీ బస్సేది..!

- మార్గం సరిగాలేదన్న సాకుతో నిలిపివేసిన అధికారులు
- మంచిర్యాల-దేవాపూర్ వరకు.. బైపాస్ గుండా సేవలు
- ప్రైవేటు వాహనాల్లో అవస్థలు పడుతూ ప్రజల రాకపోకలు
- ఫ్రీ బస్సు అవకాశం ఉన్నా.. ఆర్థికంగా నష్టపోతున్న మహిళలు


కాసిపేట మండల కేంద్రానికి, దేవాపూర్‌కు వేర్వేరుగా వెళ్లే బైపాస్ రోడ్డు

కాసిపేట, ఏప్రిల్ 3 : కాసిపేట మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గంటల తరబడి వేచిచూస్తూ ప్రైవేటు వాహనాల్లో అవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. నిత్యం మండల కేంద్రంలోని ప్రజలు, ముఖ్యంగా వివిధ శాఖల్లో పని చేసే అధికారులు, ఉపాధ్యాయులు మంచిర్యాల, బెల్లంపల్లి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఫ్రీ బస్సు అవకాశం ఉన్నా ఆర్టీసీ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చి వెళ్తూ ఇటు మహిళలు, అటు స్థానికులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

అయితే నాలుగేళ్ల క్రితం కొద్ది రోజులు బస్సు నడిపినా మార్గంలో ఇబ్బందులున్నాయని వంక చూపుతూ ఆర్టీసీ అధికారులు నిలిపివేశారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం మంచిర్యాల నుంచి కాసిపేట మండలంలోని దేవాపూర్ వరకు బస్సులు రాకపోకలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రం మీదుగా దేవాపూర్ రాకపోకలు సాగించాల్సి ఉండగా, బైపాస్ రోడ్డు గుండా వెళ్తున్నది. దీంతో కాసిపేట ప్రజలకు బస్సు అందుబాటులో ఉండడం లేదు. తప్పని పరిస్థితుల్లో బస్సుకు వెళ్లాలంటే బైపాస్ రోడ్డులో దిగి మండల కేంద్రానికి నడుచుకుంటూ గానీ, ఇతర వాహనాల్లో రావాల్సిన దుస్థితి. బైపాస్ రోడ్డుకు నడుచుకుంటూ రావడం ఇబ్బందవుతుండడంతో చాలా మంది బైపాస్ రోడ్డు గానీ, సోమగూడెం వరకు గానీ ప్రైవేటు వాహనాల్లో వచ్చి అక్కడి నుంచి మంచిర్యాల, బెల్లంపల్లికి ప్రయాణం సాగిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగిస్తే ఆర్టీసీకి కూడా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నదని పలువురు అంటున్నారు. వెంటనే బస్సును మండల కేంద్రం మీదుగా నడిపించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్‌ను వివరణ కోరగా, ఒకసారి రూట్‌ను పరిశీలిస్తామని తెలిపారు. బస్సు సౌకర్యానికి వీలుగా ఉంటే సర్వీ రాకపోకలు కొనసాగిస్తామని వివరించారు.

# మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్ల కలకలం !

- కర్రెగుట్టపై మందుపాతరలను పశ్నిస్తూ ఆదివాసీ యువజన సంఘం పేరిట హెచ్చరికలు



మావోలను హెచ్చరిస్తూ ఆదివాసీ యువజన సంఘం పేరిట వెలిసిన పోస్టర్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): 'ఆదివాసీల మీద అప్రకటిత యుద్ధం.. మావోయిస్టులారా తీరవా.. మీ రక్త దాహాలు, ఇదేనా మీ సిద్ధాంతం..? ఇందుకోసమేనా మీ పోరాటం..? మావోయిస్టులపై ఆదివాసులు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి జాగ్రత్తా !' అని ప్రశ్నిస్తూ హెచ్చరికలతో ఆదివాసీ యువజన సంఘం, తెలంగాణ రాష్ట్రం పేరిట అంటించిన పోస్టర్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లో కలకలం రేపాయి. ములుగు జిల్లాలోని వాజెడు, వెంకటాపురం మండలాల్లోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న కర్రెగుట్ట పేలుడు ఘటన, మందుపాతర అమర్చడంపై మావోయిస్టులు చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ.. ముద్రించిన పోస్టర్లు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ పోస్టర్లపై చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి, బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివాసీ సంఘం పేరిట మావోయిస్టులకు హెచ్చరికలు జారీ చేయడంతో ఈ ప్రాంతంలో పోలీస్ శాఖ అప్రమత్తమై ప్రత్యేక నిఘా పెంచారు. వీటిని ఆదివాసీ సంఘం నాయకులు పోస్టర్లను అంటించారా ? లేదా ? ఇంకా ఎవరైనా ఇలాంటి పని చేశారా ? అనే దానిపై పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. ములుగు జిల్లాలో జరిగిన ఘటనను ఇక్కడ ప్రస్తావిస్తూ వాల్ పోస్టర్లు అంటించి మావోయిస్టులకు సవాల్ విసరడంపై చర్చనీయాంశమైంది.

# ఘనంగా హనుమాన్ జయంతి

మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాలను అరటి చెట్లు, మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. వేదపండితులు, ఆలయ అర్చకులు మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, హనుమాన్ చాలీసా, పారాయణం చేశారు. ఆయా చోట్ల అన్నదానాలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో శ్రీవిశ్వనాథ స్వామి దేవాలయంలోని గల ఆంజనేయస్వామి ఆలయంలో కార్యనిర్వహన అధికారి ముక్త రవి ఆధ్వర్యంలో స్వామివారికి ఆలయ అర్చకులు వామనభట్ల బాలకృష్ణ శర్మ, సంగనభట్ల నరహరి శర్మ, వామనభట్ల శ్రీకేశ్ పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ఎదురుగా గల గోవింద క్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. భారతీయ నాట్యకళలో కూచిపూడి నృత్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని కమాండెంట్ వెంకట్రాములు పేర్కొన్నారు. బెటాలియన్ పోలీసు కుటుంబాలతో పాటు గుడిపేట, నంనూర్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. దండేపల్లి మండలం గూడెం సత్యదేవుని ఆలయ కొండ చుట్టూ హనుమాన్ దీక్షాపరులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. చెన్నూర్ పట్టణంలోని ప్రతాప మారుతి హనుమాన్ మందిర్‌లో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. దహెగాం మండల కేంద్రంలోని శ్రీరామ ఆలయం నుంచి భక్తులు శోభాయాత్ర చేపట్టారు. పాత దహెగాంలోని హనుమాన్ ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ పూజలు చేశారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని కాగజ్‌నగర్-పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి పక్కన గల శ్రీ అభయాంజనేయ విగ్రహం వద్ద బ్రహ్మశ్రీ బాచంపల్లి కమలాకర్ శర్మ, మాజీ జడ్పీటీసీ సముద్రాల సరితారాజన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ముస్లింలు పండ్లు, మంచినీరు అందజేశారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఎస్ఐ ప్రవీణ్ శోభాయాత్రను ప్రారంభించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కన్నెపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కెరమెరి, తాండూర్, భీమిని, రెబ్బెన, నెన్నెల మండలాల్లో వేడుకలు నిర్వహించారు.


మంచిర్యాల అర్బన్ : విశ్వనాథ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు బాలకృష్ణ శర్మ, నరహరి శర్మ


పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


చెన్నూర్‌లోని ప్రతాప మారుతి హనుమాన్ ఆలయంలో కల్యాణోత్సవం జరిపిస్తున్న పండితులు

## నిర్మాణాలు వేగవంతం చేయాలి


పనులు ప్రారంభిస్తున్న శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్

జైపూర్, ఏప్రిల్ 12 : నీటి ట్యాంకుల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు వద్ద నిర్మించనున్న నీటి కుంటకు శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సీఅండ్ఎండీ బలరాం ప్రారంభించిన 'నీటి బింధువు జల సింధువు' కార్యక్రమం ద్వారా సింగరేణి వ్యాప్తంగా 50 కుంటలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, గని మేనేజర్ రవికుమార్, రక్షణ అధికారి సతీశ్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కారు దగ్ధం

జైపూర్, ఏప్రిల్ 12 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి రసూల్‌పల్లి వద్ద శనివారం రాత్రి ప్రమాదశత్తు కారు దగ్ధమైనట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వేమనపల్లి మండలకేంద్రానికి చెందిన డ్రైవర్ కవిరాజ్ కుటుంబ సభ్యులతో కొండగట్టు వెళ్లి వస్తున్నాడు. రసూల్‌పల్లి సమీపంలో జాతీయ రహదారిపై స్పార్క్ వచ్చి, కారులో మంటలు వచ్చాయి. కారు పక్కనే నిలిపి, దిగిపోయారు. మంటలు వ్యాప్తి చెంది దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఎవ్వరికీ ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## కారు ఢీ కొని లేగదూడ మృతి

మందమర్రి, ఏప్రిల్ 12 : మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి అందుగులపేట సమీపంలో జాతీయ రహదారిపై కారు లేగదూడను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మందమర్రి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు రోడ్డుపై సంచరిస్తున్న లేగదూడను ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

## రూ.లక్ష కాజేసిన సైబర్ నేరగాళ్లు

జైపూర్, ఏప్రిల్ 12 : ఫేక్ అకౌంట్ క్రియేట్‌చేసి, బంధువుగా నమ్మించి రూ.లక్ష కాజేసిన సైబర్ క్రైం సంఘటన జైపూర్‌లో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన సయ్యద్ ఇలియాజ్, సయ్యద్ జహీర్ బంధువులు. జహీర్ బతుకుదెరువు నిమిత్తం సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. ఈ క్రమంలో జహీర్ ఫేస్‌బుక్ అకౌంట్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, మూడు నెలలుగా అతడి పేరుతో ఇలియాజ్‌కు మెసేజ్‌లు పంపిస్తున్నారు. 10వ తేదీన తాను ఆపదలో ఉన్నానని, వీసా సమస్య వచ్చిందని, రూ.లక్ష కట్టాలని, లేకపోతే జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఇలియాజ్‌కు మెస్సేజ్ పంపించారు. దీంతో స్పందించిన ఇలియాజ్, పోన్ పే ద్వారా నగదు పంపించాడు. సాయంత్రం జహీర్‌కు ఫోన్‌చేసి, డబ్బు పంపిన విషయం చెప్పాడు. డబ్బు తనకు రాలేదని చెప్పడంతో షాక్ గురైన ఇలియాజ్.. మోసపోయానని గ్రహించి జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

వాంకిడి, ఏప్రిల్ 12 : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్, సిద్ధార్థ యువజన సంఘాల ఆధ్వర్యంలో మహా రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ నాయకులు తెలిపారు. ముఖ్య అతిథిగా ఏఎప్పీ చిత్తరంజన్ హాజరై, ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండలానికి చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని కోరారు. భారతీయ బౌద్ధమసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాహుల్కర్, మండలాధ్యక్షుడు జయరాం, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, సమాజ అధ్యక్షుడు విలాస్, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, కార్యదర్శి ప్రతాప్, ఎస్టీ ఇన్‌చార్జి సందీప్, నాయకులు రోషన్, విజయ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు సామగ్రి అందజేత

దండేపల్లి, ఏప్రిల్12 : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని దండేపల్లి మండలంలోని తాళ్లపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం మాలమహానాడు యూత్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి, ఫ్రూట్స్ అందజేశారు. మాల మహానాడు యూత్ సభ్యులు, స్థానిక హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కౌటాల, ఏప్రిల్ 12 : సిర్పూర్(టీ) మండలం టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్(20) శనివారం వార్దా నదిలో అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జయేందర్ కనిపించడంలేదని కుటుంబ సభ్యులు 9వ తేదీన సిర్పూర్(టీ) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం వార్దా నదిలో మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్ఐ కమలాకర్ అక్కడికి వెళ్లి, పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే జయేందర్ శరీరంపై గాయాలున్నాయని, మృతిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టు మార్టం రిపోర్టు తర్వాత మృతికి గల కారణాలు తెలియజేయనున్నట్లు వెల్లడించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి, ఏప్రిల్ 12 : మండలంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధి నీల్వాయి, మామడ, కొత్తపల్లి, కేతపల్లి, కల్మపేల, ముల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, ఒడ్డుగూడెం, మంగెనపల్లి, వేమనపల్లి, సుంపుటం, జాజులపేట, ముక్కిడి గూడెం, కల్లెంపల్లి గ్రామాలకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

కోటపల్లి, ఏప్రిల్ 12 : కిష్టంపేట నుంచి చెన్నూర్‌కు వెళ్లే 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కోటపల్లి, ఆలుగామ, దేవులవాడ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 10 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 12 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం వారసంత సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా (తారిక్) ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. కార్యదర్శి పుల్లూరి శంకర్, డైరెక్టర్ వెంకటరమణ రెడ్డి, నాంపల్లి శంకర్, రావుల వినాయకరావు, సభ్యులు కాంద్రే విశాల్, ముభాషిర్, జావిద్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


రాకేశ్ గౌడ్(ఫైల్)

కోటపల్లి, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలో తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తాళ్లపల్లి రాకేశ్ గౌడ్(30) చెందినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. వేమనపల్లి మండలం దస్నాపూర్‌కు చెందిన రాకేశ్ కోటపల్లి మండల కేంద్రంలో గీతవృత్తి చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కిన రాకేశ్ ప్రమాదవశాత్తు కిందపడగా, తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి, 108 అంబులెన్స్‌లో చెన్నూర్ దవాఖానకు, అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

## పోక్సో కేసు నమోదు

దహెగాం, ఏప్రిల్ 12 : మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన బండి రవిపై పోక్సో కేసు నమోదు చేసినట్ల ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన బాలిక.. 15 రోజులు క్రితం కొంచవెల్లి గ్రామంలోని తన మేనత్త ఇంటికి వచ్చింది. 7వ తేదీన రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సమీప ఇంట్లో ఉండే బండి రవి బాలికను పక్కనే ఉన్న గుడిసెలోకి ఎత్తుకెళ్లాడు. లైంగికదాడికి పాల్పడి, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాధిత బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఘాతుకానికి పాల్పడిన బండి రవిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


రాజవ్వ (ఫైల్)

దండేపల్లి, ఏప్రిల్ 12 : ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్తె రాజవ్వ (70) శనివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఎస్ఐ తహసినుద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజవ్వ ఉదయం ఇంటి సమీపంలో ఉన్న పెరట్లోకి వెళ్లి, తిరిగి వస్తున్నది. ఇంటి ఆవరణలోని కూలర్‌కు సంబంధించిన తీగ ప్లాస్టర్ ఊడిపోయి ఉండగా, రాజవ్వ తగిలింది. దీంతో విద్యుదాఘాతంతో మృతిచెందింది. భర్త రాజలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గంజాయి మొక్కలు పెంచుతున్న బాలుడి అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న మొక్కలు

మందమర్రి, ఏప్రిల్ 12 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి దీపక్‌కాలనీలోని ఓ ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతున్న బాలుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. దీపక్‌నగర్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం రావడంతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందితో కలసి తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి వెనుకాల 12 మొక్కలు లభించాయని, వాటిని ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బాలుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణంలో ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్లు, పెంచుతున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి మొక్కల స్వాధీనంలో చురుకుగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అభినందించి, రివార్డు అందజేశారు.

## చెట్లు నరికిన ఏడుగురు..

కన్నెపల్లి, ఏప్రిల్ 12 : మండలంలోని రెబ్బెన గ్రామ శివారు 248 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, చెట్లు నరికివేసిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. మేసినేని చంద్రయ్య, ధరావత్ రాజ్‌కుమార్, గట్టు అంకులు, జంబి దిలీప్, బోరె కాంతయ్య, దుర్గం రామకృష్ణ, జంబి రాజ్‌కుమార్ ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి చెట్లు నరికారన్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రాడ్లు దొంగిలించిన ఏడుగురు..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12 : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి సింగరేణి స్టోర్స్‌లో ఇనుపరాడ్ల దొంగతనానికి పాల్పడిన ఏడుగురిని శనివారం అరెస్ట్ చేసిట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. సింగరేణి అనుబంధ సంస్థ నీలిమ ఇండస్ట్రీకి చెందిన 60 ఇనుప రాడ్లు(టోర్ స్టీల్ ఐరన్ రాడ్స్)ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని యజమాని చిటుకూరి మల్లేశ్ ఫిర్యాదు చేశారన్నారు. ఎస్ఐ జీ రాజశేఖర్ కేసు నమోదు చేశారని తెలిపారు. శనివారం సింగరేణి ఏరియా దవాఖాన వద్ద వహనాల తనిఖీ చేస్తుండగా, ఓ ఆటో ట్రాలీ నడుపుతున్న వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడని, వెంబండించి పట్టుకోగా అందులో ఏడుగురు అనుమానాస్పందంగా కనిపించారని వివరించారు. వారి వద్ద 60 ఇనుప రాడ్లు ఉన్నాయని, అదుపులోకి తీసుకొని విచారించగా, 9 మంది దొంగతనానికి పాల్పడినటుల ఒప్పుకున్నారని తెలిపారు. ట్రాలీ, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుటామని వెల్లడించారు. పట్టణ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ జంగు, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాకేశ్, సిబ్బంది ఉన్నారు.

## ఆరుగురు పేకాటరాయుళ్లు..

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 : పట్టణంలోని రాంనగర్ ఏరియాలో పేకాట ఆడుతున్న ఆరుగురిని శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. రాంనగర్‌లో జూద గృహం నిర్వహిస్తున్న ఇరవేణి ప్రసన్న ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో బోట్లకుంట అర్జయ్య, బెల్లంపల్లి మహేశ్, రాళ్లబండి శ్రీకాంత్, పూసల శ్రీకాంత్, తోట శంకర్, ఫయాజ్ మహ్మద్‌ను అరెస్ట్ చేయగా, భూక్యా సాయి పారిపోయాడని వివరించారు. వీరి నుంచి రూ.1,11,140, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.